నాంపల్లిలో విజయం సాధిస్తా: ఫిరోజ్‌ఖాన్


కాంగ్రెస్ నాయకులతో నాంపల్లి అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్

గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గంలో విజయం సాధిస్తానని నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ప్రచార సరళి, ఓటర్లకు కాంగ్రెస్ ఇచ్చిన ఇంటింటికీ ఆరు పథకాల గ్యారంటీలపై ప్రచారం నిర్వహిస్తున్న తీరుపై ఆయన కాంగ్రెస్ నాయకులకు సలహాలు ఇచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ప్రజాధనాన్ని లూటీ చేసే ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. చంద్రశేఖర్, కురాకుల కృష్ణ, ఎం.ఆర్.రెడ్డి, రాములు తదితరులున్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేస్తా


ఆర్వోకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న రాజేశ్‌కుమార్

జంగ్ 2023 తెలంగాణ

చార్మినార్: పాతబస్తీలో ఏళ్ల తరబడి అభివృద్ధి కుంటుపడిందని.. ఈ ఎన్నికల్లో తమను గెలిపిస్తే.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, సీనియర్ నాయకులు కన్నయ్యలాల్ తదితరులతో కలిసి ఆయన మంగళవారం బహదూర్‌పురా రిటర్నింగ్ అధికారికి తన ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. 9న పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి మరో సెట్ నామినేషన్‌ను దాఖలు చేయనున్నానన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతా


మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బీ-ఫారంను అందుకుంటున్న మిత్ర కృష్ణ

గోల్కొండ: గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతానని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బీ-ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సంక్షేమ పథకాల వల్లే మళ్లీ మూడవసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రానుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ తలమానికంగా ఉందని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో పేద, బడుగు వర్గాల వారు ఎక్కువగా ఉన్నారని వేల కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరిందని ఆయన అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తూంకుంట అరుణ్‌కుమార్, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.

నాంపల్లిలో ఐదు నామినేషన్లు దాఖలు

నాంపల్లి: నియోజకవర్గంలో మంగళవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. దేశ జనహిత్ పార్టీ నుంచి మహ్మద్ నౌషద్ ఆలమ్, జక్కుల విజయలక్ష్మి, షాజుల్లా, సికందర్ అలీ, అర్షద్ అహ్మద్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. ఇప్పటి వరకు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను 63-నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి లావణ్యకు అందజేశారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. విజయనగర్ కాలనీ ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం (ఆర్ఓ కార్యాలయం) చుట్టూ వంద మీటర్ల వరకు ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నామినేషన్ వేయదలచిన అభ్యర్థితో పాటుగా మరో నలుగురిని మాత్రమే ఆర్ఓ కార్యాలయంలోనికి అనుమతి ఇస్తారు.

ముప్పిడి సీతా రాంరెడ్డికి బీ-ఫారం


బీ ఫారం అందుకుంటున్న ముప్పిడి సీతారాంరెడ్డి


చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట బీఆర్ఎస్ అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి మంగళవారం బీ ఫారం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేతుల మీదుగా బీ ఫారం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన తనకు సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే పోటీ చేసేందుకు వరుసగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరించి గెలిచేందుకు కృషి చేస్తానన్నారు.

'ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆరే'


మీదుగా బీ ఫారం అందుకుంటున్న మహ్మద్ సలావుద్దీన్ లోథీ

చార్మినార్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించనున్నారని.. ఈసారి కూడా రాష్ట్రానికి ముచ్చటగా సీఎం కేసీఆరే అవుతారని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోథీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆయన బీ ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో గతంలో కన్నా ఈసారి తమ పార్టీ మరింత బలోపేతం అయ్యిందన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తాను నామినేషన్ వేయనున్నానన్నారు.

విద్యార్థులు పుస్తక సంపదను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ విప్లవ దత్ శుక్లా

దూద్‌బౌలి: విద్యార్థులు అందుబాటులో ఉన్న పుస్తక సంపదను వినియోగించుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సిటీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్ శుక్లా అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలోని కళాశాల గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా సమయం దొరికినప్పుడల్లా గ్రంథాలయానికి చేరుకుని శాస్త్ర,సాంకేతిక పుస్తకాలను చదివి పోటీ పరీక్షలలో పాల్గొనాలన్నారు. డాక్టర్ రత్నప్రభాకర్, ఏలూరి యాదయ్య, డాక్టర్ నీరజ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శంకర్, గ్రంథ పాలకులు డాక్టర్ చేగోని రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

- గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్
- నాంపల్లి అభ్యర్థిగా సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అందరి కన్నా ముందే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధిష్టానం గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాల అభ్యర్థులను పెండింగ్‌లో ఉంచారు. దీంతో నాటి నుంచి ఆశావహులు తనకంటే తనకు టికెట్ అంటూ ప్రచారాలు సైతం చేసుకున్నారు. ఎట్టకేలకు మంగళవారం ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది.

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించింది. రెండున్నర నెలలుగా గోషామహల్ నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠ ముగిసింది. మంగళవారం నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను పార్టీ ప్రకటించి మంత్రి కేటీఆర్ బీ-ఫారం అందజేశారు. రెండున్నర నెలలుగా గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిపై నెలకొన్న ఉత్కంఠతకు తెరపడింది. దాదాపు 8 మంది అభ్యర్థులు టికెట్టు కోసం పోటీపడ్డారు. కొన్ని రోజులుగా నియోజకవర్గంలో రోజుకో పేరు మారుమ్రోగింది. సోషల్ మీడియాలో ప్రతిరోజూ ఎవరెవరినో ప్రకటించిన అభ్యర్థుల పేర్లకు ముగింపు పలికింది.

గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి బయోడేట



అభ్యర్థి పేరు	: నందకిశోర్ వ్యాస్ బిలాల్
వయస్సు	: 54 ఏళ్లు
విద్యార్హతలు	: బీఏ (రెండవ సంవత్సరం)
కుటుంబ నేపథ్యం	: భార్య ఉమాదేవి.

కూతురు: పూజా వ్యాస్, కుమారుడు: ప్రేమ్ వ్యాస్

రాజకీయ నేపథ్యం: ప్రస్తుతం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. 1997లో తెలుగుదేశం పార్టీ మహారాజ్ గంజ్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా, అనంతరం 2004లో హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2013లో బీజేపీలో చేరి హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా, యూనిటీ ఆఫ్ స్టాచు జీహెచ్ఎంసీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆదిత్య కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 20 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

కేసీఆర్ పథకాలతో రాజాసింగ్‌ను ఓడిస్తా: నందకిశోర్ వ్యాస్ బిలాల్


సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. బీ-ఫారం తీసుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులతో పాటు ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడి సహకారంతో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. అందరితో కలికట్టుగా ఉండి బీజేపీని ఓడిస్తామన్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యే రాజాసింగ్ గోషామహల్ నియోజకవర్గంలో చిల్లిగవ్వ అభివృద్ధి చేయలేదన్నారు. మంత్రి తలసాని సహకారంతోనే కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్, పూజవ్యాస్ బిలాల్, ప్రేమ్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి బయోడేటా



అభ్యర్థి పేరు	: సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్
భార్య పేరు	: దివంగత అనుపమగౌడ్
సంతానం	: అలంకృత గౌడ్, ప్రియాంక గౌడ్, నర్సింహగౌడ్
నివాసం	: పటేల్‌బాడా, నాంపల్లి
విద్యార్హత	: బీఎస్సీ

రాజకీయ నేపథ్యం: 2018 ఎన్నికల్లో నాంపల్లి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మూడవ స్థానానికే పరిమితం అయ్యారు. నియోజకవర్గంలో క్రియాశీలక నేతగా పనిచేయడంతో అధిష్టానం నాంపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించింది. నియోజకవర్గంలో 2023 ఎన్నికల్లో బరిలో దిగేందుకు అనేక మంది టికెట్ కోసం పోటీపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించినా నాంపల్లి ప్రకటించకపోవడంతో చివరి వరకు అంతా ఉత్కంఠ నెలకొంది. కానీ పార్టీ కోసం చురుగ్గా పనిచేసిన సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్‌కే మళ్లీ బీ-ఫారం ఇచ్చింది.



బీఫారం అందజేత

నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను అధిష్టానం ప్రకటించింది. మంగళవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా బీ-ఫారంను అందుకున్నారు. రెండవసారి తనకు నాంపల్లి నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం నామినేషన్‌ను దాఖలు చేస్తున్నట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ వెల్లడించారు.

రేపు ఇస్రో సైంటిస్ట్‌కు సర్ సి.వి.రామన్ అవార్డు ప్రదానం


జె.ఏ. కమలాకర్

నాంపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో భారత రత్న సర్ సి.వి.రామన్ 135వ జయంతి సందర్భంగా బెంగళూరు ఇస్రోలోని చంద్రయాన్-3 కీలక విభాగాల్లో పనిచేస్తున్న జె.ఏ.కమలాకర్‌ను ఆకృతి-సి.వి.రామన్ ఎక్సలెన్స్ అవార్డుతో ఘనంగా సత్కరించనున్నారు. ఆయన ఈ ప్రాజెక్టులో కన్ఫిగరేషన్, డిజైన్, టెస్టింగ్ విభాగాలకు చైర్మన్‌గా నేతృత్వం వహించారు. అలాగే విక్రమ్ లాండర్ దిగే ప్రదేశ్ కమిటీలో కూడా ఉన్నారు. ఈనెల 9న సాయంత్రం నగరంలోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో సత్కార సభను ఏర్పాటు చేసినట్లు ఆకృతి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చంద్రయాన్-3 ప్రజెంటేషన్ కూడా ఇస్తారని తెలిపారు.

ప్రేమ్‌సాగర్‌రావుపై చర్యలు తీసుకోవాలి

సుల్తాన్‌బజార్: తమ ప్లాట్లను ఆక్రమించి, తమను వేధిస్తున్న మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల మాజీ ఎమ్మెల్సీ, కె.ప్రేమ్ సాగర్‌రావుపై కాంగ్రెస్ అధిష్టానం చర్యలు తీసుకోవాలని కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంచిర్యాలలో మూకుమ్మడిగా 550 మంది బాధితులందరం కలిసి నామినేషన్ వేస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వెంకట్‌రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, పరశురాం, సాల్మన్, లక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్


కౌసర్‌కు భారీ గజమాలను వేస్తున్న షబ్బీర్‌ఖాన్ తదితరులు

గోల్కొండ: మజ్లిస్ ప్రజల పార్టీ అని అందువల్లే ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి ఎరగకుండా విజయాలు సాధిస్తున్నారని ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ డివిజన్‌లోని ఖాదర్‌బాగ్‌లో జరిగిన మజ్లిస్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ మజ్లిస్ నాయకులు షబ్బీర్ ఖాన్ భారీ గజమాలను క్రేన్‌తో వేసి సన్మానించారు. అనంతరం ఆయనకు వివిధ రకాల పూలతో తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు ప్రజల ప్రేమాభిమానాలు ఉన్నాయన్న విషయం ఇటువంటి సన్మానాలు తెలియజేస్తున్నాయని అన్నారు. గతంలో తాను సాధించిన మెజార్టీ కంటే రెట్టింపు మెజార్టీతో ఈసారి విజయం సాధిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు వజీఉజ్‌జమా, ఆరూస్ ఫరాన్ తదితరులున్నారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న మహ్మద్ ఒమర్ ఖాన్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటూ పాతబస్తీలోని పలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్న మహమ్మద్ ఒమర్ ఖాన్ అభినందనీయులని ఎస్ఆర్‌జడ్ ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ అబ్దుర్ రెహ్మాన్ అన్నారు. పాతబస్తీ శివారులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మహమ్మద్ ఒమర్‌కు ఉత్తమ సేవా అవార్డు-2023ను అందజేశారు. ఈ సందర్భంగా రెహానా సిద్దిఖీ, షాజియా కిద్వాయ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ముషాయిరా, కవి సమ్మేళనం ప్రేక్షకులను అలరించింది.

కార్వాన్ దర్బార్ మైసమ్మకు పూజలు


బీ-ఫారానికి పూజలు నిర్వహించిన అనంతరం అందుకుంటున్న మిత్ర కృష్ణ


జియాగూడ: కార్వాన్‌లో కనీవిని ఎరుగని రీతిలో విజయం సాధిస్తానని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. మంగళవారం బీ-ఫారం అందుకున్న తర్వాత కార్వాన్ కూడలికి చేరుకోగా నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరుకోగా టపాసులు పేల్చారు. అనంతరం కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల చేతుల మీదుగా మిత్రకృష్ణ బీ-ఫారం స్వీకరించారు. అరుణ్‌కుమార్, కిశోర్‌కుమార్, అభిషేక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, నరహరిచారి, భిక్షపతి, పట్లూరి రఘు, నర్మద, వెంకటేష్, రఘునాథ్, మంతటి నర్సింహా, విజయ్ పాల్గొన్నారు.

'సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐ అధికారులతో మిల్లర్లు కుమ్మక్కు'


మాట్లాడుతున్న సత్యమూర్తి

సుల్తాన్‌బజార్: సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐ అధికారులతో కుమ్మక్కై మిల్లర్లు వేల కోట్ల ధాన్యాన్ని తమిళనాడు కేంద్రంగా ఇతర దేశాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారని కన్సల్టేటీవ్ కమిటీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు సత్యమూర్తి ఆరోపించారు. దీంతో వేల కోట్ల కుంభకోణం జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులు పంపిడించిన పంటకు గిట్టుబాటు ధర దొరకక ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో ఎఫ్.ఈ.ఐ సివిల్ సప్లయి అధికారులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ప్రభుత్వ గోడౌన్లలో స్థలం లేదనే వంకతో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమిళనాడులోని నాగపట్నం కేంద్రంగా అక్రమంగా విదేశాలకు తరలిస్తూ అక్రమంగా వేల కోట్లు అర్జిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ భారీ కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు నిఘా ఏర్పాటు చేసి ఈ స్కామ్‌లో ఉన్న అధికారులు, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సంస్థ వద్ద ఈ బ్లాక్ మార్కెట్ దందాపై అన్ని ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ విషయంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేశామన్నారు. ఈ సమావేశంలో సభ్యులు బూర సురేందర్ గౌడ్, మహ్మద్ రిజ్వాన్, గౌతమ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ సంబరాలు



అబిడ్స్: గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించడంతో జోరుగా సంబరాలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గోషామహల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం ముందు అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను పైకి ఎత్తి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్, జయశంకర్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, శంకర్ సింగ్ జమేదార్, కోటి శైలేష్ కురుమ, పుష్ప, అనిత పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నాంపల్లి: దీపావళి పండగను పురస్కరించుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఎదురుచూస్తున్న మూడు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, అలాగే దీపావళి సెలవు దినాన్ని 13వ తేదీకి మార్చాలని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్‌ను ఆహ్వానించిన నిర్వాహకురాలు మాధవీలత

అబిడ్స్: సీతారామ్‌బాగ్ శ్రీరామ మందిరంలో జరుగుతున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞానికి రావాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను నిర్వాహకురాలు మాధవీలత ఆహ్వానించారు. మంగళవారం గవర్నర్‌ను కలిసి దేశ సమృద్ధి కోసం, దేశం సస్యశ్యామలంగా ఉండేవిధంగా ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ యజ్ఞంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే యజ్ఞాన్ని సందర్శిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యమన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



చార్మినార్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి కొనసాగినప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరిగిందని టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి, జాతీయ పొగాకు బోర్డు మాజీ సభ్యులు వాసుదేవ రావు తదితరులు ఆయన సేవలను కొనియాడారు. దంతేరస్, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి బొకే అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం అభివృద్ధి బ్రహ్మాండంగా జరిగిందన్నారు.

అక్రమంగా నగదును తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తాన్‌బజార్: అక్రమంగా నగదును తరలిస్తున్న ఓ వ్యక్తిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద రూ.7.50 లక్షల నగదును స్వాధీనపరచుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొగ్గులకుంట మయూరి పాన్‌షాపు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా దోమలగూడకు చెందిన ధర్మేందర్ అగర్వాల్ అబిడ్స్ నుంచి బొగ్గులకుంటకు వస్తుండగా తనిఖీల్లో భాగంగా హోండాసిటీ కారులో రు.7.50 లక్షల నగదును తరలిస్తుండడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకుని ధర్మేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నగదు తాలూకు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసిన పోలీసులు రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించారు.

న్యాయస్థానాలు కేసుల విషయంలో జాప్యం చేయొద్దు


మాట్లాడుతున్న స్వర్ణగౌడ్

సుల్తాన్‌బజార్: న్యాయస్థానాలు బాధితుల కేసుల విషయంలో జాప్యం చేయొద్దని మానవ హక్కుల కార్యకర్త జి.స్వర్ణగౌడ్ విజ్ఞప్తి చేశారు. తన మెడికల్ నెగ్లిజెన్సీ కేసు విషయంపై ఖైరతాబాద్ కన్జ్యూమర్ కోర్టులో మాట్లాడినందుకు పెనాల్టీగా తమ కేసును న్యాయమూర్తి మరో నెల పొడిగించాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మెడికల్ నెగ్లిజెన్సీ కేసులో భాగంగా తన కేసును గత సంవత్సరం కాలంగా వాయిదాలు వేస్తూ వస్తున్నారన్నారు. తన ఒక్క కేసు కూడా కన్జ్యూమర్ కోర్టులో ఇలాంటి కేసులు ఎన్నో వాయిదాలు వేస్తూ వస్తున్నారని ఆరోపించారు.

కరుణాకర్ సేవలు వెలకట్టలేనివి


రాజ్యసభ సభ్యుడు సదానంద్‌తనవడేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలకు వెలకట్టలేవని బీజేపీ గోవా రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు సదానంద్‌షెట్ తనవడే అన్నారు. మంగళవారం ఆయన దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన దివంగత నేత మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను దేవర వంశీ సన్మానించారు. కార్యక్రమంలో దేవర శ్రీనివాస్, రాధాకిషన్ యాదవ్, సందేష్‌యాదవ్, లక్ష్మీనారాయణ, ప్రభు పూజారి, వెంకటేష్ తదితరులున్నారు.

బీజేపీలో బీసీలకు పెద్దపీట



గోల్కొండ: బీజేపీలో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతున్నదని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లో ఆయన బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు బీజేపీ పెద్దపీట వేస్తుందని, అందువల్లే తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు. ఇతర పార్టీలకు ఈ దమ్ములేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో అగ్రకులాలదే ఆధిపత్యం అని ఆయన అన్నారు. అనంతరం బీజేపీ నాయకులంతా కలిసి బీసీల ఆత్మగౌరవ సభకు తరలివెళ్లారు.


కార్యక్రమంలో జయేశ్ రంజన్, మిధాని సీఎండీ అండ్ చైర్మన్ డాక్టర్ ఎస్.కె.ఝూ

ముగిసిన వర్క్‌షాపు

సంతోష్‌నగర్: మిశ్రు ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో రెండు రోజుల పాటు మెటలర్జీ ఫర్నాస్ మెటలర్జిస్ట్ ఇండస్ట్రియల్ ప్రాక్టీసెస్‌పై నిర్వహించిన వర్క్ షాపు మంగళవారం ముగిసింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐటీఈ అండ్ సీ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో వివిధ ఎంఎస్ఎంఈలు, ప్రైవేటు పరిశ్రమలు, విద్యా సంస్థలక చెందిన దాదాపు 150 మంది నిపుణులు పాల్గొన్నారు. మెటలర్జీ, హీట్ ట్రీట్‌మెంట్, కోరోషన్, పౌడర్ మెటలర్జీ, ఎన్‌డీటీ, మెటల్ జాయినింగ్, మెటల్ వర్కింగ్ ప్రాథమిక సూత్రాలపై ఉపన్యాసాలు నిర్వహించారు. మిధాని సీఎండీ అండ్ చైర్మన్ సంజయ్ కుమార్ ఝూ ఐఐఎం హైదరాబాద్ చాప్టర్ ప్రోగ్రామ్ స్పాన్సర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

అబిడ్స్: యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ డిస్ట్రిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గోల్కొండ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. మెడికల్ అధికారులు పీహెచ్ఎన్ఎస్ నర్సులు, ఏఎన్ఎంలు, టెక్నిషియన్లు, ఆశవర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్థానికంగా ప్రతి అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్లలో పెద్ద ఎత్తున సిబ్బంది, ఉద్యోగులు, ఆశావర్కర్లు నిరంతరం వైద్య సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన జాతీయ కల్చరల్ ఫెస్టివల్


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో జాతీయ కల్చరల్ ఫెస్టివల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శాస్త్రీయ సంగీత కళలు, జానపద నృత్యాలతో అలరించారు. అనంతరం పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, న్యూ ఐడెన్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎ.శశిపాల్‌రెడ్డి, అకాడమీ అధ్యక్షుడు పి.అమృత్‌కుమార్, ఉపాధ్యక్షులు కేఎస్ అశోక్ కుమార్, డైరెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.